# వాళ్ళేనయం

ఆ ఇల్లు వీరయ్యది. కాని అందులో సూరయ్యుంటాడు. సూరయ్య పెళ్ళాం పేరు సూరమ్మకదు. శాంతమ్మ – శాంతమ్మకి ఆరుగురుపిల్లలు. చివరివాడికి రెండేళ్ళు , ఆమెకి శాంతం తక్కువ . ప్రతి దానికీ చిరాకుపడుతుంది. పిల్లల్ని చూస్తే మరీ విసుగు. కోపం, చివరివాడ్ని తప్పించి పిల్లలందర్ని తెల్లవారగానే స్కూళ్ళకి పంపేస్తుంది. సాయంత్రం వరకు కంటపడకుండా క్యారేజీలు కట్టి పంపిస్తుంది.

శాంతమ్మకి ఇంటి ఇంటికి తిరిగి మీటింగులు పెట్టడం మహా యిష్టం. సినిమాల గురించి, చీరలు, నగల గురించి , చిన్నమ్మ మొగుడి గురించి, డాక్టరుంచుకున్న నర్సుగురించి, పచారీ దుకాణంవాడి పారిపోయిన కూతురి గురించి, ఇలా అనేకానేక విషయాల గురించి ఇంటికి ఇంటికి తిరగి భోగట్టా సేకరించి, దాన్ని అందరి చెవుల్నా వేసి , ఇంటికి రావటం ఆమె కెంతో ఇష్టం. అసలు తానందుకే పుట్టినట్లు భావిస్తుంది.

ఆరోజు పిల్లలందరూ స్కూలు కెళ్ళిపోయాక ఇంటిక తాళం పెట్టి పెత్తనాలకి బయల్దేరాలనుకుంది. కాని రెండేళ్ళ పసివాడు మంచినిద్దట్లో వున్నాడు. వాడ్ని భుజానేసుకెళ్ళటం ఆమెకిష్టం లేదు. అలాగని వాడు లేచేదాకా కార్యక్రమాన్ని వాయిదా వెయ్యటమూ ఇష్టం లేదు. కాస్సేపు ఆలోచించింది. అందులో ఆరోజు అందరికి చెప్పాల్సిన సంగతి చాలా ముఖ్యమైంది ఒకటుంది. రాత్రి సీతమ్మగారి మొగుడు కుతికల దాకా త్రాగేసి, వెళ్లి ప్రక్కింటి వాళ్ళ తలుపు తట్టేడు. ప్రక్కింటి రాధమ్మ గారు భయంతో పెద్దగా కేకలుపెట్టింది. ఆయన ' షారీ – షారీ ' అనుకుంటూ తనభాగంలో కెళ్ళాడు తనుకళ్ళారా చూసిన ఈ సగంతి వీధిలో వాళ్ళకందరికీ చెప్పకపోతే మనశ్శాంతి లేదనిపించింది. ఇప్పుడే వచ్చేద్దామని. నిద్రపోతున్న పిల్లవాడిని ఇంట్లోనే వుంచి, తలుపు తాళం వేసి ప్రక్క వీధిలో కెళ్ళింది.

చిట్టిపొట్టి ఆరోజు మధ్యాహ్నాం ఇంటికొచ్చి భోజనం చేసి మళ్ళీ సంచులు తగిలించకుని కబుర్లు చెప్పుకుంటూ స్కూలు కెడుతున్నారు. ఆ ఇంటిదగ్గరకొచ్చేసరికి వాళ్ళ కబుర్లు, కాళ్ళు కూడాఆగిపోయినాయ్.

ఇంట్లోంచి పిల్లాడి ఏడుపు అదేపనిగా వినిపిస్తోంది. వాళ్ళిద్దరూ అలాగే నిల్చుండి ఏడుపు ఏ ఇంట్లోంచి వస్తోంది గమనించారు. విచిత్రం ఆ ఇంటికి బయట తాళం వేసుంది. వాళ్ళిద్దరికి ఆశ్చర్యం అనిపించి, అరుగుపైకెక్కి కిటికీలోంచి చూసేరు.

ఆ పిల్లాడు మంచంలో కూర్చుని , గుప్పిళ్ళు మూసిపెట్టి , వెక్కి వెక్కి ఆపకుండా ఏడుస్తున్నాడు. దాహం , ఆకలి , భయం , కారణం ఏదైనా కావచ్చు.

చిట్టిపొట్టి మొహాలు చూసుకున్నారు. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. పిల్లవాడు ఏడుస్తూనేవున్నాడు. తమదారిన పట్టనట్లు పోదామంటే మనసు రావటంలేదు. ఆ పిల్లాడిని ఓదార్చటం తమ తక్షణ కర్తవ్యంగా భావించారు. " పాపం మంచినీళ్ళు కావాలేమోరా ? " అన్నాడు. చిట్టి – కిటికీలోంచి చేతులు పోనిచ్చి చప్పట్లు కొట్టేడు పొట్టి. ఆ శబ్దానికి ఆ పిల్లాడు. కిటికీవైపు చూసి ఇంకాస్త పెద్దగా బావురుమన్నాడు – వాళ్ళిద్దరికి ఏం చెయ్యాలో తెలీక కాస్సేపు కిటికీ చువ్వలు పట్టుకుని వ్రేలాడేరు. అంతలో పొట్టి అరిచాడు ' అయిడియా అంటూ . చిట్టి ఏవిటని అడిగేసరికి పొట్టి ఆ ఇంటి వెనక్కి పరిగెత్తాడు. చిట్టిగూడా ఆ వైపుగా పరిగెత్తాడు.

ఆ ఇల్లు పాతకాలంది. దొడ్డి తలుపుకిగడియ లేదు. అంచేత శాంతమ్మ తలుపుమూసి , దానిక్కడ్డంగా రుబ్బురోలుని పెడుతుంది. తలుపు నెడితే శబ్దం అవుతుంది. శాంతమ్మత్త టెక్నిక్ వాళ్ళిద్దరికీ తెల్సు. చిట్టి వెనిక్కి వెళ్లే సరికి పొట్టి తలుపుని బలంగా నెడతున్నాడు. చిట్టిగూడా సాయం పట్టేడు. కాస్సేపటికి తలుపు కొద్దిగా జరిగి కాస్త తెరుచుకుంది. ఆ ఖాళీలోంచి చిట్టి లోపలికి దూరేడు – రుబ్బురోలుని ఇంకాస్త జరిపాడు – పొట్టిగూడా లోపలికెళ్ళాడు.

పిల్లాడు ఇంకా ఏడుస్తూనే వున్నాడు. చిట్టి గ్లాసుతో నీళ్ళు తెచ్చి ఆ పిల్లాడి నోటిముందుంచేడు. నీళ్ళని గడగడా ఆత్రంగా తాగాడు. ఆపై మల్లెపువ్వులా బోసి నవ్వులు నవ్వేడు వాళ్ళిద్దర్ని చూసి. శాంతమ్మత్త కోసం ఎదరుచూస్తూ చిట్టిపొట్టి మంచంపైన కూర్చుండి పోయేరు తోడుగా.

------- అయ్యిపోయింది -------